పుంజుకుంటున్న నిమ్మ మార్కెట్

- కిలో కాయలు రూ.75
- కళకళలాడుతున్న యాదవోలు మార్కెట్



యాదవోలు మార్కెట్‌కు రైతులు తీసుకు వచ్చిన నిమ్మకాయలు

దేవరపల్లి: నిమ్మకాయల మార్కెట్ రోజురోజుకూ పుంజుకుంటోంది. నెల రోజులుగా మార్కెట్లో ధర పెరుగుతూ వస్తోంది. ఫిబ్రవరిలో కిలో నిమ్మకాయల రేటు రూ.30 ఉండగా, ఇప్పుడు రూ.75 పలుకుతోంది. కాయ సైజును బట్టి ధర పలుకుతోందని రైతులు తెలిపారు. నాసిరకం కాయలు రూ.70 ధర పలుకుతున్నాయి. పెద్దసైజు కాయలు కిలో రూ.75 పలకడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కిలో నిమ్మ పండ్ల ధర రూ.60 పలుకుతోంది. ఈ ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. గతేడాది మార్చిలో కిలో రూ.60 ఉండగా, ఏప్రిల్, మే నెలల్లో రూ.180 గరిష్ట రేటు పలికింది. దీంతో దిగుబడులు లేకపోయినా రైతులు మంచి లాభాలు పొందారు.

తగ్గిన దిగుబడులు

నిమ్మకాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయని రైతులు తెలిపారు. అధిక వర్షాలకు పూతల దెబ్బతిన్నట్టు వివరించారు. సాధారణంగా ఎకరానికి 40 నుంచి 50 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చీడపీడలు, తెగులు వ్యాపించడం వల్ల దిగుబడులు సగానికి తగ్గినట్టు తెలిపారు. ధర ఆశాజనకంగా ఉన్నప్పటికీ దిగుబడులు లేవని రైతులు వాపోతున్నారు.

రైతులతో కళకళలాడుతున్న మార్కెట్

నిమ్మమార్కెట్ రైతులతో కళకళలాడుతోంది. రోజుకు 350 బస్తాలు (170 క్వింటాళ్లు) మార్కెట్‌కు వస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. యాదవోలు మార్కెట్లో ఎటువంటి కమీషన్ లేకుండా రైతుల నుంచి వ్యాపారులు పంటను కొనుగోలు చేయడం వల్ల పరిసర మండలాల నుంచి రైతులు ఈ మార్కెట్‌కు నిమ్మకాయలు తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకుంటున్నారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల, కామవరపుకోట మండలాల నుంచి రైతులు యాదవోలు మార్కెట్‌కు కాయలను తీసుకు వస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. ఏడాదిలో నిమ్మ మూడు కాపులు వస్తుంది. ఈ సీజన్‌లో దిగుబడి తక్కువగా ఉంటుంది. వేసవిలో నిమ్మకాయల వినియోగం ఎక్కువగా ఉండడం వల్ల డిమాండ్ ఉంటుందని రైతులు తెలిపారు.

ధర బాగున్నా.. దిగుబడులు లేవు



నిమ్మకాయల ధర బాగున్నప్పటికీ దిగుబడులు సగానికి పడిపోయాయి. ఎకరాకు 40 బస్తాలు (20 క్వింటాళ్లు) మించి వచ్చే పరిస్థితి లేదు. గతేడాది మంచి ధర లభించడం వల్ల రైతులు ప్రధానంగా కౌలు రైతులు గిట్టుబాటు ధర పొందారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేస్తే రైతులకు ఆదాయం పెరుగుతోంది. ప్రస్తుతం మార్కెట్ ఆశాజనకంగా ఉంది. నిమ్మ తోటల్లో నవ ధాన్యాలను సాగు చేస్తే భూసారం పెరుగుతుంది.

– సింగులూరి రామ్మోహనరావు, రైతు, యాదవోలు

బయ్యవరం అగ్ని ప్రమాదంపై వివరాల సేకరణ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ తదితరులు

తాళ్లపూడి: మండలంలోని బయ్యవరంలో ఆదివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైన జీడిమామిడి, జామాయిల్ తోటలను తహసీల్దార్ టి.రాధిక, ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది సోమవారం పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందని? వారు రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టం వివరాలను ఉద్యానవన శాఖాధికారులు తయారు చేస్తున్నట్టు చెప్పారు. బాధిత రైతులు మందపాటి కుమారి, పి.సరోజ, గూడా రాజ్యలక్ష్మి, కస్సే ధనలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతికి వచ్చే దశలో ఉన్న జీడిమామిడి పంటను కోల్పోయామంటూ అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం వచ్చేలా చూడాలని కోరారు. మంటలు ఎలా వ్యాపించాయో ఇప్పటికీ తెలియ లేదన్నారు. కాగా ప్రక్కిలంక వచ్చిన హోం మంత్రి తానేటి వనితకు పలువురు రైతులు అగ్నిప్రమాదం గురించి వివరించారు.

క్లుప్తంగా

నేడు విర్డ్‌లో చారిటబుల్ ఆర్థోపెడిక్ వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో మంగళవారం చారిటబుల్ ఆర్థోపెడిక్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆస్పత్రి ట్రస్టు చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యుడు కామినేని శ్రీనాథ్ ఈ శిబిరంలో రోగులకు సేవలు అందిస్తారన్నారు. భుజం, మోచెయ్యి (ఎముక, జాయింట్) సమస్యలు ఉన్నవారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 83744 45108, 08829-271177 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లాంగ్ జంప్ కోర్టు ఏర్పాటు



నల్లజర్ల హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన లాంగ్‌జంప్ కోర్టు

నల్లజర్ల: పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థుల కోసం నల్లజర్ల జెడ్పీహైస్కూల్ మైదానంలో సర్పంచ్ పల్లి జ్యోతి లాంగ్‌జంప్ కోర్టు ఏర్పాటు చేశారు. అన్ని క్రీడా ఈవెంట్స్‌కు ఈ మైదానంలో కోర్టులు ఉన్నప్పటికీ లాంగ్‌జంప్ ప్రాక్టీసు కోసం మాత్రం అభ్యర్థులు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో జెడ్పీ హైస్కూల్ మైదానానికి వెళ్లాల్సి వచ్చేది. వారి ఇబ్బందులు గుర్తించిన సర్పంచ్ భర్త సుబ్బారావు తన సొంత ఖర్చులతో మూడు రోజుల వ్యవధిలో లాంగ్‌జంప్ కోర్టు ఏర్పాటు చేశారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ అభ్యర్థులు సుబ్బారావును అభినందించారు.

రెండు రోజుల పాటు రైల్వే అండర్ పాస్ మూసివేత

ఉండ్రాజవరం: రైల్వే లైన్ల ఆధునీకరణలో భాగంగా మండలంలోని కాల్దారి వద్ద గల రైల్వే అండర్ పాస్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు, వాటర్ లీకేజీల నివారణ కోసం బుధ, గురువారాలు రెండు రోజుల పాటు కాల్దారి –వేలివెన్ను గ్రామాల గల రైల్వే అండర్ పాస్‌ను నిలిపివేస్తామని అధికారులు తెలిపారు.

విజ్జేశ్వరంలో పారిశుధ్య పనులు

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం గ్రామంలో ఆ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామ నడివీధిలోని డ్రెయిన్లలోని పూడికను, వ్యర్థాలను తొలగించినట్టు సర్పంచ్ తిక్కా శ్రీనివాస్ తెలిపారు. అలాగే గ్రామంలోని వీధిలైట్ల మరమ్మతులు చేపట్టామని చెప్పారు.

టాలెంట్ సెర్చ్ టెస్ట్ విజేతలకు బహుమతులు



టెన్త్ టాలెంట్ సెర్చ్ టెస్ట్ విజేతలతో సత్తిరాజు

దేవరపల్లి: యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు సామాజిక విశ్లేషకుడు సుంకవల్లి సత్తిరాజు టాలెంట్ సెర్చ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో విజేతలైన విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతులతో పాటు రూ.2 వేల విలువైన జ్ఞాపికలు, పరీక్ష సామగ్రి, ప్రశంసా పత్రాలను సోమవారం హైస్కూల్ వద్ద ఆయన అందజేశారు. పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ ఆయన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా టెన్త్ విద్యార్థులకు టాలెంట్ సెర్చ్ టెస్ట్ నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్డ్ ఇండియా సంస్థ ప్రతినిధి సోమిశెట్టి వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైనాట్‌కు హేర్ సంస్థకు బెస్ట్ రిటైలర్ అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న వైనాట్ అధినేత వెంకట్రాయుడు

తణుకు: ఎలక్ట్రానిక్స్ రంగంలో పేరెన్నికగన్న వైనాట్ సంస్థ మరో అవార్డు సొంతం చేసుకుంది. దక్షిణ భారతదేశంలో రిటైల్ విభాగంలో హేర్ ప్రొడక్ట్స్ అత్యధికంగా విక్రయించినందుకు గాను బెస్ట్ రిటైలర్ అవార్డు సాధించినట్లు వైనాట్ షాపింగ్‌మాల్ అధినేత బుజ్జవరపు వెంకట్రాయుడు తెలిపారు. ఢిల్లీలోని హేర్ కంపెనీ కర్మాగారంలో ఆదివారం నిర్వహించిన వేడుకలో ఈ అవార్డును వెంకట్రాయుడు అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రాయుడిని పలువురు అభినందించారు.

ప్రక్కిలంకలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం ప్రక్కిలంక రామాలయంలో సీతారాముల కల్యాణం సందడి



ప్రక్కిలంకలో స్వామివారిని దర్శించుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత తదితరులు

- శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణోత్సవం
- పాల్గొన్న హోం మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని కాళింగపేటలో పునః నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుడు కౌతవరపు విశ్వనాథశర్మ బృందం ఆధ్వర్యంలో తొలుత శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రమూర్తి, గణపతి, అయ్యప్ప స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి తానేటి వనిత స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితులు, స్థానిక నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి భక్తులకు స్వయంగా వడ్డించి భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. సుమారు 12 వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా హరే శ్రీనివాస బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ వేడుకలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, నాయకులు యాళ్ల బాబురావు, కుంటముక్కల కేశవనారాయణ, తోట రామకృష్ణ, ముళ్ల పోశిబాబు, సిద్ధంశెట్టి కృష్ణ, విత్తం నాని, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెలగదుద్రులో సీతారాముల కల్యాణోత్సవం

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుద్రు రామాలయం నాల్గో వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా వేద మంత్రాలతో హోమాలు, అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం బాజా భజంత్రీల మధ్య స్వామివారి ఊరేగింపు సందడిగా సాగింది. పరిసర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు మొఖంమాటం సుబ్బారావు, యాతం రాజు, జగతా సూర్యనారాయణ, పిండి వెంకటరత్నం, దొడ్డా వెంకన్న, యువకులు ఏర్పాట్లను పరివేక్షించారు.

చాగల్లులో దానవాయిస్వామి గ్రామోత్సవం

చాగల్లు: స్థానిక చిలకమ్మ బీడులో కొత్తగా నిర్మించిన జ్ఞాన శక్తి దానవాయిస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి గ్రామోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. మంగళవారం విఘ్నేశ్వర పూజ జరుగుతుంది. బుధవారం దానవాయిస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాస హోమం, రత్నన్యాసం వంటి పూజలు నిర్వహిస్తారు. అలాగే బుధవారం భారీ ఎత్తున భక్తులకు అన్న సమారాధన చేస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



వెలగదుర్రులో సీతారాముల కల్యాణం



చాగల్లులో దానవాయిస్వామి గ్రామోత్సవం

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



చాగల్లు: ఊనగట్ల గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. సాయిబాబాకు గణపతి పూజ, అఖండ దీపారాధన, ఆరాధనలు, క్షీరాదివాసం, నీరాజన మంత్ర పుష్పాల సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా ఆలయాన్ని, విద్యుత్తు దీపాలంకరణతో అలంకరించారు. పూర్ణాహుతి, అన్నసమారాధాన జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశేష అలంకరణలో ఊనగట్లలోని సాయిబాబా వారు

రాష్ట్రస్థాయి పోటీలకు ఊనగట్ల విద్యార్థినులు



హెచ్‌ఎం తదితరులతో మౌనికా సాయి, నాగభవాని

చాగల్లు: బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు మండలంలోని ఊనగట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పుల్లూరి మౌనికా సాయి, గుడాల నాగభవాని ఎంపిక య్యారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీఎస్ రామానుజం సోమవారం తెలిపారు. మండలంలోని బ్రాహ్మణగూడెం జెడ్పీ హైస్కూల్లో ఈ నెల 5న జిల్లాస్థాయి జూనియర్స్ బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఊనగట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పాల్గొన్న మౌనికా సాయి, నాగభవాని విశేష ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు హెచ్‌ఎం వివరించారు. వారిద్దరూ త్వరలో నిర్వహించే బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలికల పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆ ఇద్దరు విద్యార్థినులను పంచాయతీ సర్పంచ్ మట్టా వెంకట్రావు, ఉపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయుడు పి.లెనిన్‌బాబు అభినందించారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేత పురుషోత్తపల్లి జట్టుకు ప్రదానం చేసే ట్రోఫీతో నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు

నిడదవోలు రూరల్: క్రీడలతో యువతలో మానసిక స్థైర్యం పెరుగుతుందని నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని చర్చిపేట యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. ఆ టోర్నమెంట్‌లో 32 జట్లు పాల్గొనగా పురుషోత్తపల్లి జట్టు కప్ కైవసం చేసుకుంది.విజ్జేశ్వరం జట్టు రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో ఎస్సై పి.నాగరాజు, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు, సోమేశ్వరరావు, ఎస్.రమేష్, యూత్ సభ్యులు జె. శ్రీను, టి.రవి, సీహెచ్ సత్యనారాయణ, ఎం.బబ్లూ, కె.సూరి, ఎ.అనిల్‌కుమార్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చందనను కలిసిన యువజన విభాగం అధ్యక్షుడు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న సోమవారం రాజమహేంద్రవరంలో ఆ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నాగేశ్వర్‌కు ఈ సందర్భంగా వీరన్న శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి చిరు సత్కారం చేశారు. మండలంలోని ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, కాపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు కామన రత్నాజీ, ఆత్కూరి ప్రసాద్ పాల్గొన్నారు.

17 నుంచి ద్వారకాతిరుమలలో గో సమ్మేళనం

- తెల్లజాతి పశువుల అందాల పోటీలకు ఏర్పాట్లు
- వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన దేవస్థానం ఈవో త్రినాథరావు



గో సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో త్రినాథరావు తదితరులు

ద్వారకాతిరుమల: నిరాదరణకు గురవుతున్న ఒంగోలు జాతిని అభివృద్ధి చేసేందుకు, రైతులను ప్రోత్సహించేందుకు గో సమ్మేళనం ఏర్పాటు చేయడం శుభ పరిణామమని శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఈనెల 17 నుంచి 19 వరకూ నిర్వహించే గో సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను సోమవారం ఈఓ ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గో సమ్మేళనంలో భాగంగా నిర్వహించనున్న ఒంగోలు ఆవులు, గిత్తలు, పుంగనూరు ఆవులు, గిత్తల అందాల పోటీలు, అలాగే ఒంగోలు ఆవుల పాల పోటీల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి పోటీలు రైతులను ఎంతగానో ప్రోత్సహిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు బొండాడ వెంకన్నబాబు, పాకలపాటి భద్రరావు, డీజే రాజు, ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పలపాటి చక్రపాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: ఆర్టీసీ బస్సు ఢీ కొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలో సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో నిడదవోలు మండలం కోరుమామిడికి చెందిన మల్లి తూట్లమ్మకు బలమైన గాయాలయ్యాయి. జంగారెడ్డిగూడెం వెళ్లేందుకు తూట్లమ్మ కోరుమామిడిలో సోమవారం నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కింది. ప్రయాణికులు టిఫిన్ చేయడానికి చిన్నాయగూడెంలోని హోటల్ వద్ద బస్సును ఆపారు. బస్సు దిగిన తూట్లమ్మ బస్సు ముందు నుంచి నడిచి వెళుతుండగా, అదే బస్సు ఆమెను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తూట్లమ్మ రెండు కాళ్లు, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా 108 వాహనంలో చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు.

వివాహితపై దాడి చేసిన ఐదుగురిపై కేసు

నిడదవోలు రూరల్: వివాహితపై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ సోమవారం తెలిపారు. దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొయ్యే రత్నమాలకు నిడదవోలు మండలం పెండ్యాలకు చెందిన కాయల రమేష్‌తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా జీవిస్తున్నారు. వారి మధ్య మళ్లీ వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఈనెల 5న కోరుపల్లి వచ్చిన తనపై భర్త రమేష్, అఖిల్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు దాడి చేశారంటూ రత్నమాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

భార్యను కొట్టిన భర్తపై..

కొవ్వూరు: చెడు వ్యసనాలకు బానిసైన తన భర్త ఈ నెల ఐదో తేదీన జుట్టు పట్టుకుని తనను కొట్టి గాయపరిచాడంటూ మండలంలోని వేములూరుకు చెందిన కె. సాగరిక అనే వివాహిత పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబశివమూర్తి సోమవారం కేసు నమోదు చేశారు. ఆయన కథనం ప్రకారం విజయ్‌కుమార్‌తో పదేళ్ల క్రితం సాగరికకు వివాహమైంది. ఐదేళ్ల పాటు కాపురం సజావుగానే సాగింది. ఐదేళ్లుగా చెడు వ్యసనాలకు బానిసైన విజయ్‌కుమార్ తరచూ తనను కొట్టి హింసిస్తున్నాడంటూ సాగరిక ఫిర్యాదు చేసింది. ఈనెల 5వ తేదీ రాత్రి తనతో గొడవపడిన భర్త తనను జుట్టు పట్టుకుని కొట్టి గాయపరిచినట్టు ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొంది.

సెల్‌ఫోన్ చోరీపై ..

కొవ్వూరు: పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన ఘంటా వెంకటేష్‌కు చెందిన సెల్ ఫోన్ సోమవారం కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీకి గురైంది. దీనిపై వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ కార్యాలయంలో వెంకటేష్ పనిచేస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు కొవ్వూరు బస్టాండ్‌లో తన సెల్‌ఫోన్‌ను అపహరించుకుని పోయినట్టు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.